# ఇంతకు మించి ఏమి కావాలి!

[illegible]

తెల్లవారుఝాముల మెలకువ వొచ్చింది మహదేవయ్యకి!

లేచికూర్చున్నాడు

కిటికీలోంచి చూసాడు

చీకటి నిశ్శబ్దం ఇంకా తెల్లవారలేదని తెలియ జేస్తున్నాయి

బాత్రూమ్‌కి వెళ్ళొచ్చాడు

గడియారం వైపు చూసాడు

అదీ తెల్లవారలేదని చెప్తోంది తనకి తెలిసిన టిక్కు టిక్కు భాషలో

ఇంకాస్సేపు పడుకోవాలన్నమాట!

ఆ ఆలోచన అతనికెలాగో అనిపించింది పడుకునేందుకేమాత్రం తీరికలేని తరుణప్రాయంలో తెర తెరలుగా నిద్ర కమ్మేస్తుంది

కానీ ఈ ముసలితనంలో ఏం చేసినా నిద్రాదేవి దరికి రానేరాదు

మహదేవయ్య నడుం వాల్చాడు

ఇటు దొర్లినా అటు పొర్లినా ముడుచుకు పడుకున్నా ముసుగు దన్నినా నిద్రమాత్రం రాలేదు

విసుగేసి లేచి కూర్చున్నాడు

పక్క మంచం మీదున్న భార్య మంచి నిద్రలో ఉంది

ఆమె ముఖమ్మీద పడిందాయన దృష్టి

ఎంత నైర్మల్యం ఆ ముఖంలో

ఎంత చక్కటి చిరునవ్వు ఆ పెదవుల్లో!!

ఎంత పుణ్యం చేసుకున్నాడో ఆమెని పొందాడు

కానీ ఆమేం పాపం చేసుకుందో తను లభించాడు

తను ఆమెకేమిచ్చాడు ఇప్పటిదాకా??

ఓ నగో ఓ చక్కటి పట్టు చీరో కొని ఇవ్వలేదు కానీ ఆమె ఒంటి మీదివే ఏదో ఓ కారణమ్మీద ఒలుచుకుపోయాడు

తలగడ మీద అసహనంగా కదిలింది తల

ఉమ్మడి కుటుంబంలో పెద్ద కోడలిగా ప్రవేశించిన మహాలక్ష్మి అప్పట్నుంచి ఇప్పటిదాకా కేవలం చాకిరీకే అంకితమై పోయింది

ఆడపడుచుల పెళ్ళిళ్ళు కాన్పులూ మరుదుల చదువులూ అందరి రాకపోకలూ ఈ లోగా తమకు పిల్లలు పుట్టుకు రావడమూ వాళ్ళని పెంచడమూ వాళ్ల పెళ్ళిళ్ళూ వాళ్ల కాన్పులూ ఇవే ఆమె తన జీవితంలో చూసినవి!!

ఒకే ఒక్క రోజైనా మూరెడు మల్లెపూలు కొనలేదు అదవా ఏమైనా తానామెకోసం తెచ్చినా అది ఆమెదాకా అందేదే కాదు

అందుకే చాలా రోజుల్నుంచి ఆయన అనుకుంటున్నాడు మహాలక్ష్మికో మంచి చీర కొనాలని తన షష్ఠి పూర్తి రోజున ఆమె అది కట్టుకోవాలని తను కళ్లారా చూసుకోవాలని ఆయన కోరిక

ఆ కారణమ్మీదే ప్రతి పైసా కూడబెడుతూ వచ్చాడు

షష్ఠి పూర్తి ఎల్లుండే!! రేపే తన పిల్లలంతా వచ్చేది కనక కావాల్సినంత హడావిడిగా ఉంటుంది

కనక ఇవాళే తను కొనేయాలి

మెల్లిగా మంచం దిగాడు మహదేవయ్య

లోపలెక్కడో మంచం కింద పడున్న పాత ట్రంకు తెరిచాడు అందులోంచి డబ్బు దాచుకున్న మట్టి కుండ తీశాడు ఆ గది తలుపు గడియ పెట్టుకుని డబ్బంతా లెఖ్ఖపెట్టుకున్నాడు

మంచం కింద వంగి ట్రంకు బయటకి లాగడం లాంటివి వయసుమళ్ళిన ఆయనకి ప్రయాసతో కూడుకున్నవే!! కానీ కోరిక వాటిని పట్టించుకోడం లేదు

ఆయనకి మరీ అంత తృప్తిగా అనిపించలేదు ఇంకా ఎక్కువ డబ్బు పోగై ఉంటుందని ఆశించాడు పోన్లే కూడిన దాంట్లోనే కొంటేసరి అనుకున్నాడు

పని మనిషి కాబోలు తలుపు దబదబా బాదేయడంతో డబ్బు జాగ్రత్త చేసి తలుపు తీసేందుకు ముందుకు కదిలాడు

* * *

ఆ రోజు షష్ఠిపూర్తి

ఇల్లంతా సందడిగా ఉంది

చేతనైనంతలో అన్నీ ఘనంగా చేసారు పిల్లలు

తల్లీ తండ్రికి బట్టలు తెచ్చారు

తనివితీరా కట్టబెట్టి కళ్యాణం జరిపారు

మహదేవయ్య చీర ఇంకా ఇవ్వలేదు

కొత్త పెళ్ళి కూతురు వన్నెకి రాకూడదని పిల్లలంతా అన్నా వినిపించుకోకుండా తనే అన్నీ వండి పిల్లలకి తినిపించింది భర్తకీ తినిపించింది అంతా మరీ మరీ మెచ్చుకుంటూ అన్నీ తిన్నారు అదంతా చూస్తూ ఉంటేనే కడుపు నిండిపోయి నట్టు అనిపించిందేమో సరిగ్గా తిననేలేదామె!

చీర ఎప్పుడెప్పుడిద్దామా అని ఉందాయనకి! కానీ ఏదో మొహమాటం!!! ఎందుకో తడబాటు!!

రాత్రైంది భోజనాలయ్యాయి

పిల్లలంతా మాట్లాడుకుంటూ మాట్లాడు కుంటూనే మగతలోకి వెళ్ళిపోయారు

అప్పుడు భర్త ఉన్న గదిలోకి వచ్చింది మహాలక్ష్మి

తలంటుకున్న తల్లో పూలదండ గాలికి ఎగురు తున్న వెండి తీగలు పాల భాగమ్మించి ఠీవిగా చూస్తున్న ఎర్రటి కుంకం బొట్టు తాంబూలం వేసుకున్న ఎర్రటి పెదవులు ప్రొద్దుట్నుంచీ కట్టుకున్న కొత్త చీర మార్చి తెల్లటి మామూలు నూలు చీర కట్టుకున్నా ఆ చీరకి చిన్నపాటి చిరుగులున్నా బంగారుగాజు ఒక్కటీ లేక గాజు గాజుల్తో ఉన్నా ఎంతో అందంగా కనిపిస్తోంది మహాలక్ష్మి ఆయన కళ్ళకి!!

ఆమె కళ్లల్లో సిగ్గు ఆమె పెదవుల్లో ముసి ముసి నవ్వులూ చూస్తున్న ఆయనకి తమ మొదటి రాత్రే గుర్తొచ్చింది

ఆ మాటే చెప్పాడు వచ్చి కూర్చున్న ఆమెతో!!

నాకూ అదే గుర్తొస్తోంది అంది నేల చూపులు చూస్తూ!

ఆమె చేతిలో కొత్త చీర పెట్టాడాయన

అందుకుంది మెరిసే కళ్లతో మురిసిపోతున్న మనస్సుతో!

రేపు కట్టుకోవాలి చెప్పాడు మహాదేవయ్య

నవ్వింది

ఇద్దరూ పెళ్ళినాటి కబుర్లు చెప్పుకున్నారు

నీకు గుర్తుందా మన మొదటి రాత్రి రోజున నేను నీకు చీర ఇచ్చానని!!

తలూపింది మహాలక్ష్మి

ఆ రోజు మీరు మాట్లాడిన ప్రతీ మాటా, మీరు చేసిన ప్రతి చిన్న చిలిపి చేష్ట చక్కగా గుర్తున్నాయి అంది మహాదేవయ్య భుజమ్మీద తలవాల్చి!!

ఇద్దరూ గతంలోకి వెళ్ళిపోయారు

★ ★ ★ ★ ★ ★ ★

అప్పుడే నిద్రలేచి బయటకొస్తున్న మహా దేవయ్యకి

మీ మామగారికి దణ్ణం పెట్టరామ్మా! అన్న మాటలు వినిపించాయి

ఆలోచనగా చూస్తూ ఆగాడు

కోడలు వచ్చింది

నమస్కరించి నడిచిపోయింది

అతనలాగే నిలబడిపోయాడు

ఎర్రటి గుంటూరు చీర సన్నటి జరీ అంచుది కట్టుకుంది కోడలు

ఆ చీర ఆ చీర ??

అతనింకా తేరుకోకుండానే మహాలక్ష్మి వచ్చిందక్కడికి!

కోడలు నీళ్ళు పోసుకుందన్న సంగతి నాకిప్పుడే తెల్సిందండీ!! వెంటనే ఏమైనా ఇవ్వాలనిపించింది మన వంశాంకురం వెలుస్తున్న వేళలో కోడలికేమీ ఇవ్వకపోతే ఎలా?? అందుకని

మహాదేవయ్య మహాలక్ష్మివైపే చూస్తూ



నిలబడిపోయాడు

ముప్పై రెండేళ్ల క్రితం తను తన భార్యకి మొదటి రాత్రి కొనిచ్చిన చీరతాలూకు సంగతి గుర్తొచ్చింది

ఆ మర్నాడు ఇలాగే గది బయటికొచ్చేసరికి పెద్ద చెల్లి కొత్త చీరలో వచ్చి దణ్ణంపెట్టింది

అప్పుడూ మహాలక్ష్మి ఇలాంటి మాటే చెప్పింది కాస్త తేడాలో!!

'నళిని పుట్టినరోజటండీ ఇవాళ!' ఏదైనా ఇవ్వాలనున్నా చేతిలో డబ్బులేదే అని అత్తయ్య బాధపడుతుంటే ఈ చీర ఇచ్చాను అంటూ చెప్పుకుపోయింది

అప్పుడు చూసినట్టే ఇప్పుడూ చూసాడాయన ఇంత మంచిదానివైన నీకు నేనేమి ఇచ్చాను అంటున్నట్టుగా!

ఈ అనురాగపు చూపు నాపై మమతగల మనసుకు మించి నాకింకేం కావాలండీ?? అంటున్నట్టుగా చూసి నవ్వింది మహాలక్ష్మి □